సాక్షి
అనకాపల్లి
మంగళవారం, 8, జూలై, 2025

- పోలవరం ఎడమ కాల్వ గట్లపై 50 కిలోమీటర్ల మేర విలువైన కలప స్మగ్లింగ్
- అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న టేకు, అకేషియా, యూకలిప్టస్ చెట్లు
- టింబర్ డిపోలు, ప్లై వుడ్ పరిశ్రమలకు విక్రయిస్తున్న కేటుగాళ్లు
- కళ్ల ముందే రూ.లక్షల విలువైన కలప తరలిపోతున్నా పట్టని యంత్రాంగం

● రాత్రికి రాత్రే చెట్లు మాయం

# కలప దొంగల మాయాజాలం



రేగుపాలెం సమీపంలో పోలవరం ఎడమ ప్రధాన కాల్వ గట్టుపై నరికేసిన నీలగిరి చెట్ల మానులు

**యలమంచిలి రూరల్: పోలవరం ఎడమ ప్రధాన కాల్వ గట్లపై ఉన్న విలువైన టేకు, అకేషియా, యూకలిప్టస్ చెట్లు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. రెండు దశాబ్దాల కాలం నాటి ఈ** చెట్లను కొందరు స్మగ్లర్లు దర్జాగా నరికించి వాహనాలతో వారికి కావాల్సిన ప్రాంతానికి యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. తమ కళ్ల ముందే ఇదంతా జరుగుతున్నా పోలవరం ఎడమ ప్రధాన కాల్వ పనుల పర్యవేక్షక అధికారులు గానీ, అటవీ, రెవెన్యూ, ఇతర శాఖల యంత్రాంగం కానీ పట్టించుకోకపోవడంతో విలువైన కలప అక్రమ రవాణా నిరాటంకంగా కొనసాగుతోంది. యలమంచిలి డివిజన్ కేంద్రంగా 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కృషితో పోలవరం ఎడమ ప్రధాన కాల్వ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కాల్వ నిర్మాణం కోసం ప్రభుత్వ, ప్రైవేటు, జిరాయితీ భూములను సేకరించారు. జిల్లాలో పాయకరావుపేట నుంచి తాళ్లపాలెం వరకు 6, 7 ప్యాకేజీలుగా పనులు జరుగుతున్నాయి. సుమారు 50 కిలోమీటర్ల పొడవున్న పోలవరం ఎడమ ప్రధాన కాల్వకు రెండు వైపులా **గట్లపై విలువైన అకేషియా, టేకు, యూకలిప్టస్ చెట్లు వందల సంఖ్యలో ఉండేవి. ఇటీవల ఈ చెట్లపై అక్రమార్కుల కన్ను పడింది. రాత్రి, పగలు తేడా లేకుండా చెట్లను యంత్రాలతో నరికి, వ్యాన్లు,** ఇతర వాహనాలతో కర్రల మిల్లులు, వ్యాపారులకు విక్రయించుకొని జేబులు నింపుకుంటున్నారు.

**కోట్లాది రూపాయల అక్రమార్జన**

యలమంచిలి, తాళ్లపాలెం, అడ్డురోడ్డు, పాయకరావుపేట ప్రాంతాలకు చెందిన కొందరు స్మగ్లర్లు కూలీలతో పోలవరం గట్లపై విలువైన చెట్లను నరికించి అమ్ముకోవడం ద్వారా లక్షలాది రూపాయలను అక్రమంగా ఆర్జించారని సమాచారం. అకేషియా చెట్లు కేవలం ప్రభుత్వ, అటవీ భూముల్లోనే ఎక్కువగా పెరుగుతాయి. టన్ను అకేషియా కలప ధర నాణ్యత బట్టి రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ఉంటుంది. యూకలిప్టస్ (నీలగిరి) రకం టన్ను రూ.4 వేల వరకు పలుకుతోంది. ఇక బొలేరో వాహనంతో 4 టన్నులు, ట్రాక్టర్‌తో 6 టన్నులు, టాటా ఏస్ లాంటి చిన్న వాహనాలతో 1.5 టన్నుల నుంచి 2 టన్నుల వరకు కలప రవాణా చేస్తున్నారు. ఒకసారి అకేషియా కలప తరలిస్తే వాహనాన్ని బట్టి **రూ.15 వేల నుంచి రూ.42 వేల వరకు** కొల్లగొట్టొచ్చు. పోలవరం కాల్వకు రెండు వైపులా గట్లపై ఉన్న అకేషియా, నీలగిరి చెట్లన్నీ దాదాపుగా నరికివేతకు గురయ్యాయి. నరికించిన చెట్ల మాను, కొమ్మలకు సైతం ధర పలుకుతోంది. ప్రస్తుతం కొన్ని చోట్ల మాత్రమే చెట్లు కనిపిస్తున్నాయి. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో వీటిని కూడా అక్రమార్కులు క్రమంగా తరలించుకుపోయే అవకాశం కనిపిస్తోంది. యలమంచిలి, అనకాపల్లి, అడ్డురోడ్డు, పాయకరావుపేట ప్రాంతాల్లో టింబరు డిపోల యజమానులు, కొందరు రద్దు కర్రల వ్యాపారులు, కార్పెంటర్లు కూడా అక్రమంగా నరికిన కలప కొనుగోలు చేస్తున్నారు. సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపం కలప స్మగ్లర్లకు బాగా కలిసి వస్తోందనే చెప్పాలి.



అకేషియా చెట్లు నరికివేయగా మిగిలిన మొదలు



షేకిళ్లపాలెం సమీపంలో ఒక కర్రల డిపోలో అకేషియా కలప

### మా దృష్టికొస్తే చర్యలు

పోలవరం ఎడమ ప్రధాన కాల్వ గట్లపై విలువైన చెట్లను అక్రమంగా నరికి, రవాణా చేస్తున్నారన్న విషయం మొదటిసారిగా తెలిసింది. మా సిబ్బంది పోలవరం ఎడమ ప్రధాన కాల్వ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తారు. రాత్రి సమయాల్లో తరలించుకుపోతే మేము ఏం చేయగలం. ఎవరైనా అలాంటివి మా దృష్టికి తీసుకొస్తే వెంటనే స్పందిస్తాం. అంతేకానీ ప్రత్యేకంగా చెట్ల నరికివేతపై నిఘా పెట్టలేం.

–జి.రామకోటేశ్వరరావు, ఈఈ, యలమంచిలి డివిజన్

## నేడు వైఎస్సార్ జయంతి

- సేవా కార్యక్రమాలతో ఘన నివాళి అర్పించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ పిలుపు



చోడవరం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చోడవరం నియోజకవర్గంతోపాటు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌కు నివాళులు అర్పించడంతోపాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు.

## సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు

- కలెక్టర్ విజయకృష్ణన్
- పశుగ్రాస వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పశు గ్రాస వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: జిల్లాలో ఈ నెల 14వ తేదీ వరకు జరిగే పశుగ్రాస వారోత్సవాలలో రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, జొన్న, మొక్కజొన్న, పిల్లి పెసర పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో సోమవారం పశుగ్రాస వారోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో పచ్చి మేత ప్రాముఖ్యత, శాస్త్రీయ పద్ధతిలో పశుగ్రాసం పెంచే విధానాలు, పశుగ్రాసం నిల్వ చేసే పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఐదు నుంచి ఆరు లీటర్లు పాలిచ్చే పశువులను పచ్చి మేతతోనే పోషించవచ్చన్నారు. పచ్చి మేతలో విటమిన్ ఏ శాతం ఎక్కువగా ఉండడంతో పశువులు ఆరోగ్యంగా ఉండి సకాలంలో ఎదకురావడంతో పాటు పాల దిగుబడి బాగా పెరుగుతుందన్నారు. పశుగ్రాసాలను అన్ని ప్రాంతాల్లో అన్ని మాసాల్లో సాగు చేయవచ్చన్నారు. మిశ్రమ పంటగా కూడా సాగు చేసుకోవచ్చని చెప్పారు. వరి కోసిన తరువాత భూమిలో ఉండే తేమతో జనుము, పిల్లి పెసర సాగు చేసుకోవచ్చన్నారు. జొన్న రకాలను 50 శాతం పూత దశలో తప్పక కోయాలని, లేత దశలో కోస్తే హైడ్రోసైనిక్ యాసిడ్ అనే విష పదార్థం విడుదలై హాని కలిగిస్తుందని సూచించారు. డీఆర్వో సత్యనారాయణరావు, కేకేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ సుబ్బలక్ష్మి, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహనరావు పాల్గొన్నారు.

# జనం మదిలో రాజన్న




మంచితనానికి మరో పేరు, మానవత్వానికి ప్రతిరూపం, చిరునవ్వుకు చిరునామా, అచ్చతెలుగు పంచెకట్టుకు వన్నె తెచ్చిన రైతు బాంధవుడు, తెలుగుదనానికి నిండైన రూపం.. ఆయనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన మదిలో మెదిలితే రైతన్నకు కొండంత ధైర్యం. అక్కాచెల్లెమ్మలకు భరోసా.. విద్యార్థి లోకానికి 'నేనున్నానంటూ' వెన్నుతట్టి ప్రోత్సహించిన అనుభూతి. ఉమ్మడి విశాఖ జిల్లాలో మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి చేసి జిల్లాపై చెరగని ముద్ర వేశారు. ఇప్పుడు ఆయన అందించిన అభివృద్ధి ఫలాలు కళ్ల ముందు కదలాడుతున్నాయి. మంగళవారం రాజన్న జయంతి సందర్భంగా ఆయన చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తుచేసుకుందాం.

– సాక్షి, విశాఖపట్నం

**ఉమ్మడి విశాఖ జిల్లా సమగ్రాభివృద్ధికి వైఎస్సార్ హయాంలోనే అడుగులు**

**మహానేత మరణంతో కుంటుపడిన అభివృద్ధి**

**వైఎస్ జగన్ హయాంలో పరుగులు**

**నేడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి**

వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి విశాఖ జిల్లా తీవ్ర సంక్షోభంలో ఉంది. తాగునీటి సమస్య, అచ్యుతాపురం సెజ్, పరవాడ ఫార్మాసిటీ, గంగవరం పోర్టు భూసేకరణ వివాదాలు పరిష్కారం కాకుండా ఉన్నాయి. అలాగే స్టీల్‌ప్లాంట్, బీహెచ్‌పీవీ, షిప్‌యార్డులు నష్టాల్లో కూరుకుపోయి ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో 2005 జనవరిలో వైఎస్సార్ విశాఖలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. విశాఖ నగరంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. అచ్యుతాపురం, ఫార్మా సెజ్‌లకు భూముల ధరలు నిర్ణయించి, పునరావాస ప్యాకేజీలు ప్రకటించారు. నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను గట్టెక్కించి, రెండో దశ విస్తరణకు నిర్ణయం తీసుకున్నారు. బీహెచ్‌పీవీని బీహెచ్ఈఎల్‌లో విలీనం చేయాలని, షిప్‌యార్డును రక్షణ శాఖలో విలీనం చేసి పునరుజ్జీవింపచేయాలని నిర్ణయించారు.

### గ్రేటర్ హోదా కల్పన



ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహా విశాఖ ప్రతిపాదనలకు వైఎస్సార్ ముఖ్యమంత్రి కాగానే కార్యరూపం ఇచ్చారు. 2005 నవంబర్ 22న విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు గ్రేటర్ హోదా కల్పించారు. దీంతో విస్తీర్ణం 111 చ.కి.మీ. నుంచి 540 చ.కి.మీ.లకు పెరిగింది. వైఎస్సార్ మరణానంతరం జీవీఎంసీ వార్డుల విస్తరణ నిలిచిపోయింది. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మరో 10 పంచాయతీలను విలీనం చేసి, జీవీఎంసీని ప్రస్తుతం 98 వార్డులుగా విస్తరించారు.

### దేశంలోని టాప్ నగరాల్లో విశాఖ ఒకటిగా...

వైఎస్సార్ చొరవతో విశాఖ జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునర్నిర్మాణ పథకం (జేఎన్ఎన్‌యూఆర్ఎం) కిందకు వచ్చింది. దేశవ్యాప్తంగా ఈ పథకం అమలైన 63 నగరాల్లో వైజాగ్ ఒకటి. ఈ పథకం ద్వారా విశాఖకు రూ.1885 కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. బీఆర్‌టీఎస్ కారిడార్లు, ఫ్లై ఓవర్లు, తాగునీరు, భూగర్భ మురుగునీటి వ్యవస్థతో సహా 20కి పైగా కీలక ప్రాజెక్టులు ఆయన హయాంలోనే ప్రారంభమయ్యాయి.

### గోడు చెప్పిన వారందరికీ గూడు



నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో వైఎస్సార్ రాజీవ్ గృహకల్ప పథకాన్ని ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేసి, నగర పరిధిలో లక్షకు పైగా పునరావాస కాలనీలను నిర్మించారు. రాజీవ్ గృహకల్ప ద్వారా రూ.650 కోట్లతో 15,320 ఇళ్లు, జేఎన్ఎన్‌యూఆర్ఎం ద్వారా రూ.600 కోట్లతో 15 వేల గృహాలు, వాంబే కింద రూ.400 కోట్లతో 9 వేల ఇళ్లు నిర్మించారు.

### యువతకు ఉపాధి.. భవితకు పునాది



2008 జనవరి 2న వైఎస్సార్ ఉపాధి పథకాన్ని ప్రారంభించి, యువతకు 13 అంశాల్లో శిక్షణ ఇచ్చి, 70 శాతం ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయన మరణానంతరం ఈ పథకానికి గ్రహణం పట్టింది. చంద్రబాబు హయాంలో నిరుద్యోగం పెరిగింది. తిరిగి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షలాది ఉద్యోగాలను అందించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ పేరుతో కాలయాపన చేస్తోంది.

### ఐటీకి ఆద్యుడు



విశాఖను ఐటీ హబ్‌గా మార్చాలని వై.ఎస్.రాజశేఖరరెడ్డి సంకల్పించారు. దీని కోసం నగరంలోని మూడు కొండల కింద ఉన్న 100 ఎకరాల ప్రాంతాన్ని గుర్తించి, కనీసం 100 ఉద్యోగాలు కల్పించే ఐటీ కంపెనీలకు మౌలిక సదుపాయాలతో ప్లాట్లు అందించారు. దాదాపు 200 కంపెనీలు ముందుకురాగా, 70 శాతం కార్యకలాపాలు ప్రారంభించాయి. సత్యం, విప్రో వంటి పెద్ద కంపెనీలు కూడా ఇక్కడ శాఖలను విస్తరించాయి. వైఎస్సార్ మరణానంతరం విశాఖ ఐటీ ప్రగతి కుంటుపడింది. టీడీపీ హయాంలో కంపెనీలకు రాయితీలు అందకపోవడంతో అవి వెనక్కి వెళ్లిపోయాయి. సుమారు పదేళ్ల పాటు విశాఖ ఐటీ రంగం స్తంభించిపోయింది. 2019లో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించడం, ఐటీ కంపెనీల స్థాపనకు ప్రోత్సాహం, అదానీ డేటా సెంటర్ శంకుస్థాపన వంటి చర్యలతో తిరిగి ఐటీ అభివృద్ధి పుంజుకుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఐటీ అభివృద్ధి కేవలం మాటలకే పరిమితమైంది.

### అంతర్జాతీయ హోదా ఆయన ఘనతే



రూ.100 కోట్లు ఖర్చు చేసి విశాఖ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించిన ఘనత వైఎస్సార్‌దే. దీంతో అంతర్జాతీయ సర్వీసులు పెరిగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ పాలనలో రాయితీలు నిలిపివేయడంతో సర్వీసులు రద్దయ్యాయి. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. కార్గో సర్వీసులు కూడా మొదలయ్యాయి. ఆయన హయాంలోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపన జరిగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విశాఖ విమాన సర్వీసులపై సవతితల్లి ప్రేమ కురిపిస్తోందని ఆరోపణలున్నాయి.

### విమ్స్ ఏర్పాటుకు శ్రీకారం



ఉత్తరాంధ్ర ప్రజలకు నిమ్స్ తరహా వైద్య సేవలు అందించే లక్ష్యంతో వైఎస్సార్ 2006లో విమ్స్ ఆస్పత్రికి శ్రీకారం చుట్టారు. రూ.250 కోట్లతో 2007లో శంకుస్థాపన జరిగి, 2009 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయన మరణానంతరం పనులు మందగించాయి. చంద్రబాబు ప్రభుత్వం విమ్స్‌ను ప్రైవేటుపరం చేయాలని ప్రయత్నించగా వైఎస్సార్‌సీపీ అడ్డుకుంది. అనంతరం వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా చేసిన అభివృద్ధితో ప్రస్తుతం విమ్స్ ఉత్తరాంధ్రలో పెద్ద ఆస్పత్రిగా భాసిల్లుతోంది.

### ఏలేరు నీటిని తీసుకొచ్చింది రాజన్నే...



గోదావరి జలాలను విశాఖ, ఉత్తరాంధ్ర అవసరాలకు మళ్లించే లక్ష్యంతో వైఎస్సార్ పోలవరం ఎడమ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా, ఏలేరు నీటిని మళ్లించడం ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు ఎదురయ్యే నీటి సమస్యను పరిష్కరించారు. ఆయన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేశారు.

### గిరిజనానికి బాసటగా..




విశాఖ ఏజెన్సీలో కాఫీ ప్లాంటేషన్ ప్రాజెక్టును వైఎస్సార్ తీసుకొచ్చి, రూ.144 కోట్లు కేటాయించి 60 వేల మంది గిరిజనులకు ఉపాధి కల్పించారు. పోడు వ్యవసాయాన్ని నేరంగా భావించే కాలంలో, వైఎస్సార్ 2009 జులై 12న అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా గిరిజనులకు హక్కు పత్రాలు పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఆయన మరణానంతరం భూ పంపిణీ జరగలేదు. తిరిగి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సాగు చేస్తున్న గిరిజనులకు హక్కు పత్రాలు అందజేశారు.

## రేపే గిరి ప్రదక్షిణ



- మధ్యాహ్నం 2 గంటలకు తొలిపావంచా వద్ద పుష్పరథం ప్రారంభం
- 10న ఉదయం 5.30 గంటల నుంచి దర్శనాలు




గిరి ప్రదక్షిణ మ్యాప్



స్వామివారి తొలిపావంచా

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామి కొలువైన సింహగిరి ప్రదక్షిణ (గిరి ప్రదక్షిణ) బుధవారం జరగనుంది. లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని అంచనా వేసి కలెక్టర్ హరేంధిర ప్రసాద్, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులు సేద తీరేందుకు 29 ప్రాంతాల్లో స్టాళ్లు, 31 చోట్ల వైద్య శిబిరాలు, 12 ప్రదేశాల్లో 17 అంబులెన్సులు, 5 ప్రదేశాల్లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ప్రతీ స్టాల్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు.

**మధ్యాహ్నం 2 గంటలకు కదలనున్న రథం**

కొండదిగువ స్వామి తొలిపావంచా వద్ద నుంచి బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామి మూల విరాట్, ఉత్సవమూర్తులు కొలువుదీరిన ప్రచార రథం బయలుదేరుతుంది. రథంతోపాటు గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులంతా ఆ సమయానికి తొలిపావంచా వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది.

**పుష్పరథం తిరిగే మార్గం**

తొలిపావంచా, అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్‌జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ డబుల్‌రోడ్డు, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, ఎన్ఏడీ కొత్తరోడ్డు, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంటుంది.

**భక్తులు ప్రదక్షిణ చేసే మార్గం**

తొలిపావంచా, అడవివరం, పైనాపిల్‌కాలనీ, సెంట్రల్‌జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్, ఎంవీపీకాలనీ, సీతమ్మధార, నరసింహనగర్, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పరాడ, మురళీనగర్, మాధవధార, ఆర్అండ్‌బీ కార్యాలయం, లక్ష్మీనగర్, కుమారి కల్యాణమండపం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకోవాలి.

**దర్శన సమయాలు**

9వ తేదీన ఉదయమే గిరి ప్రదక్షిణ ప్రారంభించి అదే రోజు రాత్రికి తిరిగి సింహాచలం చేరుకునే భక్తులకు రాత్రి 10 గంటల వరకు దర్శనాలు లభిస్తాయి. 10వ తేదీ ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేస్తారు. తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు దర్శనాలు లభిస్తాయి. సింహగిరిపై 10న ఆలయ ప్రదక్షిణలు చేసే భక్తులను తెల్లవారుజామున 3 గంటల నుంచి అనుమతిస్తారు.

**ఉచిత ప్రయాణం**

10వ తేదీ ఉదయం 3 గంటల నుంచి భక్తుల రద్దీ ముగిసే వరకు కొండపై నుంచి దిగువకు, దిగువ నుంచి కొండపైకి 50 ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఏర్పాటు చేశారు. దేవస్థానం బస్సులు కూడా అందుబాటులో ఉంటాయి.

**ఏర్పాట్లు ఇలా..**

- తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు 45 క్యూలు, 100 ఇనుప గడ్డర్లు సిద్ధం చేస్తున్నారు. అడవివరం నుంచి హనుమంతవాక వెళ్లే బీఆర్‌టీఎస్ మార్గంలోని రెండో టోల్‌గేట్ వద్ద 20 ఇనుప గడ్డర్లు, 10 క్యూలు ఏర్పాటు చేస్తున్నారు.
- గిరి ప్రదక్షిణ మార్గంలో దాదాపు 40 ప్రాంతాల్లో 400 తాత్కాలిక మరుగుదొడ్లను జీవీఎంసీ ఏర్పాటు చేస్తోంది. దేవస్థానం ఏర్పాటు చేసే అన్ని స్టాళ్లలో జీవీఎంసీ మంచినీరు సరఫరా చేస్తోంది.
- అప్పుఘర్ వద్ద స్నానాలు ఆచరించే భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్యశిబిరం, రెండు జనరేటర్లు, కమాండ్ కంట్రోలింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. 60 మంది గజ ఈతగాళ్లను మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించే విధంగా ఏర్పాటు చేశారు.
- మాధవధార వద్ద 60 తాత్కాలిక మరుగుదొడ్లు, ఒక వైద్య శిబిరం, 50 ఎల్ఈడీ లైట్లు, ఒక జనరేటర్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం సిద్ధం చేస్తున్నారు.
- 10న ఆలయ ప్రదక్షిణలకు గాను ఉత్తర రాజగోపురం, దక్షిణ రాజగోపురం వద్ద వంతెనలను సిద్ధం చేస్తున్నారు.
- 10వ తేదీన సింహగిరికి వచ్చే భక్తుల కోసం 10,800 రన్నింగ్ ఫీట్ మేర క్యూలను ఏర్పాటు చేశారు. ఒకేసారి సుమారు 9 వేల మంది క్యూల్లో వేచి ఉండవచ్చు.
- 9, 10 తేదీల్లో అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు.

## అడుగడుగునా గుంతలు.. ప్రమాదాల పుంతలు



అడ్డురోడ్డు నుంచి కోటవురట్ల మండల శివారు నూకాంబిక గుడి వద్దకు వెళ్లే రహదారి దుస్థితి.. ఆదమరిస్తే గోతిలో పడే ప్రమాదం.. బిక్కుబిక్కుమని ప్రయాణం

ఎస్.రాయవరం: అవి రహదారులు కావు.. ప్రమాదాలకు ఆహ్వానం పలికే నీటి తటాకాలు. ఎప్పుడు ఏ ఆపద ముంచుకొస్తుందోనని నిత్యం భయపెట్టే నరకదారులు. అడ్డురోడ్డు నుంచి కోటవురట్ల మండల శివారు నూకాంబిక గుడి వరకు ఇదే దుస్థితి నెలకొందని జనం గగ్గోలు పెడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ పలుమార్లు ప్రారంభించి వదిలేయడంతో మరింత అధ్వానంగా మారింది. ఎన్నికల ముందు నాటి తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత పాదయాత్ర చేసి నాటి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఎన్నికలయ్యాక ఏకంగా హోం మంత్రి అయ్యారు. సంక్రాంతి నాటికి రోడ్ల రూపురేఖలు మారుస్తామన్నారు. రూ.24 కోట్లు కేటాయిస్తూ పనులు ప్రారంభిస్తున్నామని దార్లపూడి వద్ద శంకుస్థాపన కూడా చేశారు. అయినప్పటికీ రోడ్డు పనులు చేపట్టలేకపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గోతులు నూతుల్లా మారాయని, ఏమాత్రం ఆదమరచినా నీట మునగాల్సిందేనని భయపడుతున్నారు. రాత్రుళ్లు ఈ రోడ్డుపై ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి, తాత్కాలిక చర్యలైనా చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### సందడిగా లాఫింగ్ క్లబ్ 'కామెడీ కింగ్స్' కార్యక్రమం



ఆనంద్‌రాజ్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

**అనకాపల్లి:** నవ్వులు మానవ శరీరానికి ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తుందని, నిత్యం జీవితంలో నవ్వడం ప్రకృతి ఇచ్చిన వరంలాంటిదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణమండపంలో లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 'కామెడీ కింగ్స్' కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించగా, సౌత్ ఇండియా ఫేమస్ యాక్టర్ ఆనంద్‌రాజ్‌ను శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతినెలా మొదటి ఆదివారం నవ్వుల కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతకుముందు యాక్టర్ ఆనంద్‌రాజ్ తన నటించిన చిత్రాల్లో కామిడీని వినిపించి నవ్వుల జల్లులు కురిసేలా చేశారు. ఈ కార్యక్రమంలో లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు విల్లూరి వీరసంతోష్, ఉపాధ్యక్షుడు బుద్ద ప్రవీణ్‌కుమార్, 80వ వార్డు ఇన్‌ఛార్జ్ కెం.ఎ.నాయుడు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### నేడు జిల్లాస్థాయి బేస్‌బాల్ ఎంపికలు

**మాకవరపాలెం:** స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి బేస్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్టు బేస్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ అక్షజ్ కృష్ణ, అధ్యక్షుడు శివాజీ, కార్యదర్శి అప్పారావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఈ ఎంపికలు ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన పురుషులు, మహిళలు పాల్గొనవచ్చన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

### మువ్వల ప్రసాద్ కుటుంబానికి రూ.5 లక్షల సాయం



మువ్వల చిన్నకు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

**అనకాపల్లి:** విశాఖ కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తూ 2020లో మరణించిన జగన్నాథపురానికి చెందిన మువ్వల ప్రసాద్ కుటుంబానికి కలెక్టర్ విజయ కృష్ణన్ రూ.5 లక్షల చెక్కు అందజేశారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడు ప్రసాద్ తల్లి చిన్న ఎస్‌హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించింది. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో మువ్వల చిన్నకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో పర్యటించి
# అర్జీలను పరిష్కరించాలి

- కలెక్టర్ విజయ కృష్ణన్
- పీజీఆర్‌ఎస్‌కు 370 అర్జీలు

**అనకాపల్లి:** పీజీఆర్‌ఎస్‌కు ప్రతి వారం వచ్చే అర్జీలకు అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌కు అర్జీలు పోటెత్తాయి. ఈ వారం జిల్లా నలుమూలల నుంచి 370 మంది అర్జీదారులు వచ్చారు. వారి అర్జీలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే విషయంపై ఎక్కువసార్లు అర్జీలు వచ్చినట్లయితే అటువంటివి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా సమస్య ఉన్నట్లయితే అర్జీదారుతో సంబంధిత శాఖాధికారులు స్వయంగా వెళ్లి పరిష్కార మార్గాలకు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలని ఆమె దిగువ స్థాయి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, కేకేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్ సుబ్బలక్ష్మి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి, డ్వామా పథక సంచాలకులు శచీదేవి, పూర్ణిమ దేవి, జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.హైమావతి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



సెజ్ పునరావాస కాలనీ గ్రీన్ బెల్ట్ కాపాడాలని వినతిపత్రంతో వైఎస్సార్‌సీపీ నాయకులు

### సెజ్ పునరావాస గ్రీన్ బెల్ట్ కాపాడండి

**అచ్యుతాపురం రూరల్:** సెజ్ పునరావాస కాలనీని ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్ట్ కాపాడాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెజ్ కాలనీ చుట్టు పక్కల కాలుష్య కారక పరిశ్రమలు ఉన్నాయన్నారు. ప్రజలు కాలుష్యం బారిన పడకుండా గ్రీన్ బెల్ట్ కోసం 20 సంవత్సరాల క్రితం మొక్కలు నాటినట్లు తెలిపారు. అవి చెట్లుగా మారి 4300 కుటుంబాలు ఒకింత కాలుష్య బారిన పడకుండా ఉన్నాయన్నారు. ప్రస్తుతం రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామాన్ని ఈ ప్రాంతానికి తరలించేందుకు సెజ్ కాలనీ చుట్టు ఉన్న గ్రీన్ బెల్ట్‌లో చెట్లను తొలగిస్తున్నారని, దాని కారణంగా కాలనీ వాసులందరూ అనేక రకాల పరిశ్రమలు, ఫార్మా వ్యర్థ కాలుష్యం బారిన పడి అనారోగ్యానికి గురయ్యే అవకాశముందని వాపోయారు. ఇంకా 500 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు కేటాయించాల్సి వస్తే సురక్షిత ప్రాంతం కోసం వేసి చూస్తున్నామన్నారు. ఎంత సంపాదించినా ఆరోగ్యం లేని జీవితం వ్యర్థమని ఆవేదన చెందారు. అధికారులు వెంటనే స్పందించి వేల కుటుంబాలు జీవిస్తున్న సెజ్ పునరావాస కాలనీ కాలుష్యం బారిన పడకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వియ్యపు కృష్ణ, లాలం శ్రీనువాసరావు దిబ్బపాలెం -2 ఎంపీటీసీ నీరుకొండ అశోక్ కుమార్, పోలవరపు ఉస్తాలు, గాడి గణేష్ సీనియర్ నాయకులు పిల్లి రమణ, జాగారపు శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

### రహదారి నిర్మాణంలో పక్షపాతం



అనకాపల్లి మండలంలో కె.ఎ న్.ఆర్.పేట వార్డు సచివాలయం నుంచి మేతపేటలో కొత్తగా సిమెంట్ రోడ్డు నిర్మించారు. అయితే ఎలుగుబంటి అప్పారావు ఇంటి నుంచి పెంకుటిళ్ల దగ్గర పదడుగులు రహదారి వేయవలసి ఉన్నప్పటికీ ఆరు అడుగులు మేర అసంపూర్తిగా వేశారు. రోజూ చెత్త వాహనాలు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్‌కు పూర్తి స్థాయిలో బిల్లులు కూటమి నేతలు చెల్లించారు. దీనిపై నాలుగు సార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదు.

– ఎలుగుబంటి సత్యారావు, కె.ఎస్.ఆర్.పేట, అనకాపల్లి మండలం

### ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో పేరు తొలగించారు



రాంబిల్లి మండలం అగ్రహారం గ్రామంలో రెవెన్యూ అధికారులు నేవీ స్థల సేకరణ చేశారు. స్థల సేకరణలో నా జిరాయితీ భూమి, గృహం కూడా పోయింది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మంజూరులో నా పేరు గుర్తించారు. నాతో పాటు 20 మంది కలెక్టర్ కార్యాలయానికి ఆరుసార్లు వచ్చి ఫిర్యాదు చేశాం. నేటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పుడైనా పరిష్కరిస్తారని ఎదురు చూస్తున్నాను.

– పక్కుర్తి రాజు, అగ్రహారం గ్రామం, రాంబిల్లి మండలం

## సీఆర్పీ అవినీతిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న అనకాపల్లి మండలం పాపయ్యసంతపాలెం డ్వాక్రా మహిళలు

అనకాపల్లి మండలం పాపయ్యసంతపాలెంలో డ్వాక్రా సంఘాల గ్రూపు సభ్యుల నుంచి వసూలు చేసిన రూ.4.90 లక్షలు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు చెల్లించకుండా సీఆర్పీ సొంత ఖర్చులకు వాడుకున్నారు. తక్షణమే ఆ నగదు బ్యాంకు చెల్లించాలని కోరినప్పటికి నాలుగు మాసాలుగా ఇబ్బందులకు గురిచేస్తుంది. సదరు సీఆర్పీపై చర్యలు తీసుకుని నగదును బ్యాంకు చెల్లించాలని గ్రామ డ్వాక్రా మహిళలు ధర్నా చేశారు.

### ఎస్పీ కార్యాలయానికి 35 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

**అనకాపల్లి:** ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, మోసాలు, వంటి వాటిపై అర్జీలు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న, అర్జీదారులు పాల్గొన్నారు.

## స్టోన్ క్రషర్ లీజ్ రద్దు చేయాలని నిరసన



ధర్నా చేస్తున్న మాల మహానాడు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపల్లి జాన్‌మార్కు, జి.కోడూరు మాదిగ సంఘం ప్రతినిధి అప్పారావు

మాకవరపాలెం మండలం జి.కోడూరులో సర్వే నంబర్ 332లో కొండ పోరంబోకు ఆనుకుని 98 ఎకరాల్లో 13 బీసీ, 23 ఎస్సీ కుటుంబాలు తమ పూర్వీకుల నుంచి నివసిస్తున్నాయి. ఇక్కడ 2018 ఫిబ్రవరి 21న 24 హెక్టార్లలో అప్పటి టీడీపీ ప్రభుత్వం 20 సంవత్సరాల కాలవ్యవధికి రాధాకృష్ణ కన్‌స్ట్రక్షన్‌కు క్వారీ లీజు మంజూరు చేసింది. సదరు సంస్థ 2020 మే 9వ తేదీన టీడీపీకి నేతకు సబ్ లీజ్‌కు ఇచ్చింది. ఈయన నడుపుతున్న స్టోన్ క్రషర్ వల్ల 36 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, తక్షణమే నిలుపుదల చేయాలని మాకవరంపాలెం తహసీల్దార్‌కు బాధితులు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. దీనిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని జి.కోడూరు గ్రామం మాదిగ సంఘం ప్రతినిధులు ధర్నా చేపట్టారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపల్లి జాన్ మార్కు, జి.కోడూరు మాదిగ సంఘం ప్రతినిధి ఎ.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల రుణ వితరణ భేష్

- రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖమంత్రి పార్థసారథి



రైతులకు రుణాల చెక్కును అందజేస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే బండారు, తాతారావు తదితరులు

**మాడుగుల రూరల్:** డీసీసీబీ ద్వారా రూ.140 కోట్ల రుణాలు అందజేసి, 97 శాతం రికవరీ సాధించడం శుభ పరిణామని రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో, స్థానిక డీసీసీబీ బ్రాంచి సారథ్యంలో మాడుగుల టీటీడీ కళ్యాణమండపంలో సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రైతులకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ఇందులో భాగంగా రైతులకు బకాయిపడ్డ రూ.1635 కోట్లు చెల్లించామని, పొగాకు రైతుల నుంచి 2 కోట్ల కిలోలను పొగాకు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయించామని అన్నారు. డీసీసీబీ చైర్‌పర్సన్ కోన తాతారావు మాట్లాడుతూ సహకార రంగంలో గతంలో ఒక ఎకరానికి రూ.5 లక్షల రుణం అందిస్తే, ఇపుడు రూ.7 లక్షలకు పెంచామన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల ద్వారా ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అనంతరం 120 మంది లబ్ధిదారులకు రూ.2.58 కోట్లు చెక్కులను, కారుణ్య నియామకం పొందిన వారికి నియామకపు ఉత్తర్వులు అందజేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు, డీసీసీబీ సీఈవో వర్మ, జిల్లా వ్యవసాయాధికారి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి బి.మోహన్‌రావు, డీసీసీబీ బ్రాంచి మేనేజర్ కె.మహేశ్వరావు, డీసీసీబీ డీజీఎం బొడ్డేడ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, తహసీల్దార్ రమాదేవి, వెలుగు ఏపీఎంవో రమామణి పాల్గొన్నారు.

## బైకు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

**రోలుగుంట:**

నర్సీపట్నం, చోడవరం ఆర్అండ్‌బీ రోడ్డులో కంచుగుమల కూడలి సమీపంలో గల గోపీ దాబా వద్ద సోమవారం రాత్రి అదుపు తప్పి ద్విచక్ర వాహనం బోల్తా పడడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ రామకృష్ణారావు అందించిన వివరిలా ఉన్నాయి. రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామానికి చెందిన ఆరి వెంకటేష్(24) సోమవారం రాత్రి రోలుగుంట నుంచి తన స్వగ్రామం బైకుపై తిరిగి వెళుతుండగా కంచుగుమల కూడలి సమీపంలో గల గోపీ దాబా వద్ద గల గోతుల్లో అదుపు తప్పి బైకు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోయాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణారావు గాయపడిన వెంకటేష్‌ని 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకుని వెంకటేష్ భార్య సహస్ర తీవ్రంగా రోధించింది. శిథిలమైన రోడ్డులో భారీ గోతుల కారణంగానే ప్రమాదం జరిగిందని, ఇలా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, కూటమి నాయకులకు చీమకుట్టినట్టయినా లేకపోవడం బాధాకరమని పలువురు విమర్శిస్తున్నారు.

## సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి



నిరసన తెలియజేస్తున్న ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, చైర్మన్ థయామణి

- ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, చైర్మన్ థయామణి

**అనకాపల్లి:** సుప్రీం కోర్టు ఆదేశాలు మేరకు నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, చైర్మన్ థయామణి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సీఐటీయూ కార్యాలయంలో జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి అనంతరం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 22 వేల మంది ఉద్యోగులు నేషనల్ హెల్త్ మిషన్‌లో 198 కేడర్లలో 15 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్నారని వాపోయారు. ఎన్నికల హామీ మేరకు మినిమం టైం స్కేలు, ఒకే కేడర్ – ఒకే వేతనం అమలు చేయాలన్నారు. సమాన సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. వీటి సాధన కోసం అవసరమైతే ప్రత్యక్ష పోరాటానికి సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ హానరరీ చైర్మన్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా ఈ నెల 9న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల ఫెడరేషన్ అధ్యక్షురాలు శిరీష మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.వి. శ్రీనివాసరావు, పెంటయ్య, బీఎస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్మహత్య





వరహాలబాబు మృతదేహం, వరహాలబాబు(ఫైల్)

**కోటవురట్ల:** మండలంలోని రాజుపేట శివారు రామన్నపాలేనికి చెందిన పీతల వరహాలబాబు(42) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇవి.. మద్యానికి బానిసై అతడు తరచూ భార్యా పిల్లలతో గొడవపడేవాడు. మేకల మందలోని మేకలను అమ్మేసి మద్యం వ్యసనానికి బానిసయ్యాడు. ఇదే విషయమై ఆదివారం రాత్రి భార్య, పిల్లలతో గొడవ పడ్డాడు. మనస్తాపం చెంది సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో మేకల మంద దొడ్డిలో పురుగుల మందు తాగి తన కుమారుడికి ఫోన్ చేసి 'మీ అందరినీ ఇబ్బంది పెడుతున్నాను, ఇక మీకు నా బాధ ఉండదు' అంటూ తాను పురుగుల మందు తాగిన విషయాన్ని చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని స్థానిక సీహెచ్‌సీకి తరలించగా పరిస్థితి విషమించడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

## అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

- ఆర్డీవో కార్యాలయం వద్ద మోకాళ్లపై గిరిజనుల నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న గిరిజన రైతులు

**నర్సీపట్నం:** డీపట్టా భూములకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ రోలుగుంట మండలం పనసలపాడు, రావికమతం మండలం, గర్నికం, కొవ్వుగుంట, కొట్నాబెల్లి గిరిజనులు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద మోకాళ్లపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 70 మంది గిరిజనులు, 16 మంది దళితులు జీడి, మామిడి తోటలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. బ్యాంకు రుణాలు పొంది ఉన్నారన్నారు. గిరిజనులకు అన్యాయం చేసి స్థానికేతరులైన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు పట్టాలు ఇచ్చారని విమర్శించారు. కలెక్టరుకు సైతం ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు లేవన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధిదారుల జాబితాలో గిరిజనుల పేర్లు లేకుండా చేశారన్నారు. వెబ్ ల్యాండ్‌లో పేర్లు లేకపోవడంతో బ్యాంకు రుణాలు, ఎరువులు, విత్తనాలు ఇవ్వలేదన్నారు. అధిక వడ్డీలకు ప్రైవేటు రుణాలు తీసుకొని పంటలకు పెట్టుబడి పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఆర్డీవో పరిశీలన చేసి అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. అనంతరం ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్. సూరిబాబు, గిరిజన సంఘం నాయకులు ఎస్ శంకర్రావు, నాగరాజు, గేమిలా చిన్నబ్బాయి, ఎద్దుల రాజు పాల్గొన్నారు.

## గ్రామసభ నిర్వహించకుండా భూసేకరణ తగదు

- సీపీఎం నాయకుడు యర్రా దేముడు



అర్లి రైతులు, మహిళలతో కలిసి నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

**కె.కోటపాడు:** గ్రామసభ తీర్మానం లేకుండా ఎస్ఈజెడ్‌కు భూ సేకరణకు యత్నిస్తుండడం అన్యాయమని సీపీఎం నాయకుడు, ప్రజా సంఘాల కన్వీనర్ యర్రా దేముడు తెలిపారు. మండలంలోని అర్లి గ్రామంలో సోమవారం రైతులను, గ్రామస్తులను ఆయన కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ అర్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో రెండు వేల ఎకరాల భూమిని కూటమి ప్రభుత్వం దౌర్జన్యంగా తీసుకునేందుకు యత్నిస్తుందన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఎక్కడైనా ప్రభుత్వ అవసరాలకు రైతుల నుంచి భూమి తీసుకున్నట్లయితే ముందుగా గ్రామసభ పెట్టి అంగీకారం తీసుకోవాలన్నారు. భూములు తీసుకున్నట్లయితే అప్పటి మార్కెట్ ధరకు నాలుగు రెట్లు అదనంగా పరిహారం రైతులకు ఇవ్వాలన్నారు. భూమి కోల్పోయిన రైతుకు ఉపాధి, చెట్లుకు, పశుపోషణకు ఎంత పరిహారం ఇస్తారో ముందుగానే స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎటువంటి గ్రామసభలు లేకుండా భూసేకరణ సర్వే చేపట్టొద్దని రెవెన్యూ సిబ్బందికి తెలిపారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బోశం కాసుబాబు, రుత్తుల పాత్రుడు, ఎస్.రమణ, కర్రి నూకరాజు, కక్కల చెంచు తదితరులు పాల్గొన్నారు.

## సహచరుడి పాడె మోసిన స్పీకర్



పాడె మోస్తున్న స్పీకరు అయ్యన్నపాత్రుడు

**నాతవరం:** ఏఎంసీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజు అంత్యక్రియల్లో స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొని కడ వరకు పాడె మోశారు. మండలంలో మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెం గ్రామానికి చెందిన అచ్చిరాజు అనారోగ్యంతో మరణించాడు. సోమవారం ఆయన అంత్యక్రియల్లో స్పీకరు అయ్యన్నపాత్రుడు తన భార్య పద్మావతి, కుమారులు విజయ, రాజేష్‌లతో కలిసి పాల్గొన్నారు. శ్మశానం వరకు పాడె మోసి అచ్చిరాజుపై ఉన్న మమకారాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి తన వెంట నడిచిన వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, మాజీ చైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు లాలం కాశీనాయుడు, రాజాన వీర సూర్యచంద్ర, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, నేతల విజయకుమార్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జగన్నాథుని ఉత్సవాల ఆదాయం రూ.14.70 లక్షలు



నగదు లెక్కిస్తున్న ఆలయ అర్చకులు

**అనకాపల్లి:** స్థానిక గవరపాలెం అగ్గిమరిచెట్టు దేవదాయ శాఖ ఆలయ ఆలయ మండపంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ కార్య నిర్వాహణాధికారి బి.మురళి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టరు వసంత్‌కుమార్, ఆలయ చైర్మన్ దాడి బుజ్జిల ఆధ్వర్యంలో జరిగింది. సుభద్రా బలభద్ర సమేత జగన్నాథ స్వామివారి రథయాత్ర నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి భక్తులు హుండీ ద్వారా 14 లక్షల 70 వేలు 552 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో చెప్పారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఒక లక్ష 45 వేల 619 రూపాయల ఆదాయం అదనంగా వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

### వైభవంగా ధ్వజారోహణం



విష్ణు సహస్ర నామ పూజలు చేస్తున్న అర్చకులు

**అనకాపల్లి:** దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం గజస్తంభం వద్ద ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం గిరిబాబు, ప్రసాద్‌బాబు, రాజేష్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వెంకటేశ్వర స్వామి భక్తి బృందం విష్ణు సహస్ర నామ పారాయణం, పవిత్రా రోహణం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస రావు, ఈవో బి.మురళీ కృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీధర్‌రాజుకు జన్మదిన శుభాకాంక్షలు



జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజుకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ శ్రేణులు

**కశింకోట:** కన్నూరుపాలెంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు జన్మదిన వేడుకలు అభిమానుల మధ్య సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు నీటిపల్లి దివాకర్ పూలమాల వేసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొక్కిరాపల్లిలోని ప్రేమ సమాజంలో పేదలకు అన్న సమారాధన నిర్వహించారు. కన్నూరుపాలెం సర్పంచ్ ఎస్. శివ, పేరంటాలపాలెం ఉప సర్పంచ్ వజ్రపు నాగ శ్రీను, వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్లి అప్పలనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 142 దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | --- | --- |
| రెండో రకం | 3.300 | 4.000 |
| మూడో రకం | 3,200 | 3,610 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| రాజా | : కృష్ణుడికి కెంతో |
| సత్యనారాయణ స్క్రీన్-1 | : కన్నప్ప |
| సత్యనారాయణ స్క్రీన్-2 | : 3 డి |
| పర్తిసాయి | కుబేర |
| షిర్డీసాయి | : తమ్ముడు |
| వెంకటేశ్వర | : చంద్రేశ్వర |
| శ్రీ సత్య | : 3బీహెచ్‌కే |
| రామచంద్ర | : మార్గన్ |

### రక్త నిల్వలు

**అనకాపల్లి:** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 10 యూనిట్లు, బీ పాజిటివ్ -6, ఓ పాజిటివ్ -19, ఏబీ పాజిటివ్ -2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్( 9703619706)ను ఫోన్లో సంప్రదించాలని కోరారు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లి:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 361 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 343 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

# దారులు దారుణం...

గోతులతో గాల్లో ప్రాణాలు

ప్రధాన రోడ్లదీ అదే పరిస్థితి

రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామంటూ నేతలు గారడీ



కంకర లేచిపోయిన మార్టూరు వెళ్లే రోడ్డు



తుమ్మపాల యూనియన్ బ్యాంక్ వద్ద రోడ్డుపై గతుకులతో పైకి తేలిన రాళ్లు

పెద్ద పెద్ద గోతులతో నిండిన సిహెచ్‌ఎన్ అగ్రహారం రోడ్డు

**అనకాపల్లి టౌన్:** అధికారంలోకి వస్తే గతుకులు లేని రోడ్లు చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి పాలకులు ఏడాది పాలన పూర్తయినా నిద్రమత్తు వీడటం లేదు. ఇవే రోడ్లపై గతంలో విమర్శలు గుప్పించి ఇప్పుడు అంతకంటే దారుణంగా గోతులు ఏర్పడినా పట్టించుకోవడం లేదు. దాంతో ఈ రోడ్లు ప్రమాదకరంగా మారాయి. ఆదమరిస్తే ప్రాణాలు గాల్లోనే అనే రీతిలో ఉన్నాయని వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు.

అనకాపల్లి గుండాల జంక్షన్ నుంచి తుమ్మపాల వెళ్తే యధావిధిగా ఇంటికి వస్తామన్న గ్యారంటీ లేదు. ఎందుకంటే గజానికొక గొయ్యి పలకరిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు గొయ్యిల్లో నీరు చేరి ఎక్కడ గుంత ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు పడి కాళ్లూ చేతులు విరగ్గొట్టుకుంటున్నారు. తుమ్మపాలకు చెందిన భార్యాభర్తలు అనకాపల్లిలో రెండో ఆట సినిమాకి వెళ్లి తిరిగి వస్తుండగా, గొయ్యిలో పడడంతో వెనుక కూర్చున్న భార్య కింద పడిపోయింది. అదే సమయంలో క్వారీ లారీ వచ్చి సడన్‌గా బ్రేక్ వేసి అదుపులోకి రావడంతో చావును దగ్గరగా చూశామని వారు వాపోయా రు. ఇదే రహదారిలో అంబులెన్స్‌లు కూడా నెమ్మది గా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీని వల్ల ఆరోగ్య సమస్యలపై అత్యవసరంగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. మార్టూరు జంక్షన్ నుంచి మాకవ రం వెళ్లే రహదారి దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర అస్తవ్యస్తంగా తయారైంది. ప్రధానంగా పాప య్య సంతపాలెం, మాకవరం, కొండుపాలెం, సిహెచ్‌ఎన్ అగ్రహారం గ్రామాల ప్రజలు ఈ రహ దారి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, రోజువారీ కార్మికులు పలు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అదేవిధంగా తుమ్మపాల వైపు నుంచి బొజ్జన్న కొండకు వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా ఉంది. ఈ రహదారి గుండా క్వారీ లారీలు వెళ్లేటప్పుడు దుమ్ము, ధూళి లేచిపోయి ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

**కూటమి ప్రభుత్వంలో కొత్త రోడ్లేవీ?**

వాస్తవానికి సంక్రాంతి కల్లా గుంతలు లేని రోడ్లు నిర్మిస్తామన్న కూటమి ప్రభుత్వం దసరా వచ్చేస్తున్నా, రోడ్లు నిర్మించకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. మరోవైపు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కూటమి నేతలు రోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేశామంటున్న ప్రకటనలు చూసి పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. గత ప్రభుత్వంలో వేసిన రోడ్లే తప్ప కూటమి ప్రభుత్వం కొత్తగా వేసినవి లేవని బాహాటంగా విమర్శిస్తున్నారు. ఏదేమైనా తక్షణమే రోడ్లు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### పెద్ద గోతులతో తీవ్ర ఇబ్బందులు



తుమ్మపాల సమీపంలో పెద్ద గోతులు ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే అసలు గోతులు కనిపించడంలేదు. దీంతో గోతులలో పడి గాయాల పాలవుతున్నాం. తక్షణమే రోడ్లును బాగుచేయాలి.

– సింహాచలం అప్పలనాయుడు, మెట్టపాలెం

### అధిక లోడ్ వాహనాలతో ప్రమాదాలు



మార్టూరు రోడ్డులో ఎక్కడ పడితే అక్కడ గోతులు ఏర్పడడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. క్వారీ, క్రషర్ల నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్లు వేసినా మూన్నాళ్లకే యథాస్థితికి చేరుకుంటున్నాయి. అధిక లోడ్‌తో వాహనాలపై చర్యలు తీసుకోవాలి.

– కరణం నగేష్, మార్టూరు

# నేడు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి

**యువజన విభాగం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం**

**అనకాపల్లి:** స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేస్తామన్నారు. అనంతరం నియోజకవర్గ యువజన విభాగం ఆధ్వర్యంలో మెగా ఉచిత రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు ఆరోగ్యవంతులైన వారు రక్తదానం చేయవచ్చన్నారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ విచ్చేయుచున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో పెరుగుబజార్, పూడిమడక జాతీయ రహదారి జంక్షన్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. నియోజకవర్గంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అనుబంధ సంస్థల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరుకావాలని కోరారు.

# సార్వత్రిక సమ్మెకు సీపీఐ మద్దతు

**అనకాపల్లి:** బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మికుల చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం వల్ల దేశంలో అన్ని వర్గాల కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు తెలిపారు. దీనికి నిరసనగా ఈ నెల 9వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు సీపీఐ మద్దతు ప్రకటించిందన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికుల చట్టాలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. గతంలో రైతాంగం వ్యతిరేకించిన చట్టాలను వేరొక పద్ధతిలో అమలు చేసి మోసం చేసిందన్నారు. ప్రభుత్వ సంస్థలను దశలు వారీగా కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తుందన్నారు. దేశ ప్రజలపై నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ రేట్లు, పన్నులను భారం మోపుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి రాజన్న దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, ఫణీంద్ర కుమార్, మండల కార్యదర్శి వియ్యపు రాజు, విత్తనాల పోతురాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు

**రేపు దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి**

**అనకాపల్లి టౌన్:** కార్మికుల హక్కుల కోసం ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. దొరబాబు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్లకు అనుకూలంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మిక వర్గానికి పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

# క్లాప్ డ్రైవర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

**అనకాపల్లి టౌన్:** క్లాప్ డ్రైవర్స్‌ను ఆప్కోస్‌లో చేర్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. స్థానిక జీవీఎంసీ కార్యాలయంలో కమిషనర్ బీవీ రమణకు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ క్లాప్ సూపర్‌వైజరు, డ్రైవర్లు, క్లాప్ లోడర్స్‌కు సుప్రీం కోర్టు ఆదేశాలననుసరించి సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. ఈ నెల 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వాయి బోయిన శేఖర్, కిరణ్, జయరాం, సంతోష్, రాము, ఈశ్వరావు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సింగంపల్లి అజయ్, ఎర్రంశెట్టి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ అభివృద్ధికి జానకీరామరాజు కృషి



జానకీరామరాజు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్

**వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్**

**అనకాపల్లి:** వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజుకు మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. స్థానిక నర్సింగరావుపేట జానకీరామరాజు స్వగృహంలో సోమవారం జానీతోపాటు ఆయన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, నాయకులు, అభిమానులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# సదరం స్లాట్‌కు సర్వర్ మొరాయింపు

**సచివాలయాల్లో రెండు రోజులుగా దివ్యాంగుల ఇబ్బందులు**

**కశింకోట:** మండల సచివాలయాల్లో సర్వర్ పని చేయకపోవడంతో సదరం స్లాట్‌కు దివ్యాంగులు రెండు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొదటి రోజు గత శనివారం సైట్ ఓపెన్ కాలేదు. రెండో రోజు సోమవారం సైట్ ఓపెన్ కాగా ఒక్కొక్కరివి నమోదైన తర్వాత సర్వర్ మొరాయించింది. దీంతో అనేక మంది నిరీక్షించి ప్రైవేటు నెట్ సెంటర్లకు వెళ్లి నమోదు చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సదరం సర్టిఫికెట్ పొందాలంటే ప్రభుత్వం నిర్దేశించిన ఆస్పత్రుల్లో వైద్యులు పరీక్షించి అర్హత ఉన్న మేరకు వారి అంగ వైకల్య శాతం నిర్ధారిస్తారు. ఆ తర్వాత సర్టిఫికెట్ జారీ చేస్తారు. వాటితో అర్హత మేరకు దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు, రాయితీలు లభిస్తాయి. ఈ సర్టిఫికెట్లు పొందడం కోసం ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే సంబంధిత వైద్యుల వద్దకు వెళ్లడానికి స్లాట్ రసీదు ఇస్తారు. ఇందుకోసం గత శని, సోమవారాలు సచివాలయాల్లో సంప్రదించాలని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు సచివాలయాలకు వెళితే సైట్ పని చేయకపోవడంతో ఎక్కువ సమయం నిరీక్షించి వెనుదిరిగారు. కశింకోట సచివాలయంలో ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్లు సదరం సైట్‌లో నమోదుకు ప్రయత్నించగా, ఒకరికి మాత్రం నమోదైన తర్వాత మొరాయించింది. దీంతో కొంతసేపు నిరీక్షించిన తర్వాత తీవ్ర నిరాశతో దివ్యాంగులు వెనుతిరిగారు. తాళ్లపాలెం సచివాలయంలోనూ ఇదే పరిస్థితి. కన్నూరుపాలెం సచివాలయంలో మాత్రం కొంతమందికి నమోదు చేశారని సమాచారం. దీంతో ప్రైవేటు నెట్ సెంటర్లు, మీ సేవ కేంద్రాలకు అనకాపల్లి, యలమంచిలి ప్రాంతాలకు వెళ్లి కొందరు నమోదు చేసుకోవలసి వచ్చిందని వాపోయారు. నమోదుకు ఆదేశాలు లేవని, రెండు రోజులే గడువు ఇచ్చారని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీని దృష్ట్యా గడువు పెంచి సదరం నమోదుకు అవకాశం కల్పించాలని దివ్యాంగులు కోరుతున్నారు.



కశింకోట సచివాలయంలో సదరం సైట్‌లో నమోదుకు బారులు తీరిన లబ్ధిదారులు



సదరం సైట్‌లో నమోదుకు ప్రయత్నిస్తున్న సచివాలయ సిబ్బంది

### పరిశ్రమను తెరిపించాలని వినతి

**కశింకోట:** మండలంలోని కొత్తపల్లిలో మూసేసిన క్రెబ్స్ బయో కెమికల్ పరిశ్రమను తెరిపించాలని ఉద్యోగులు, కార్మికులు కోరారు. ఈ మేరకు విశాఖలో కాలుష్య నియంత్రణ మండలి జోనల్ కార్యాలయం అధికారి సుదర్శనరావును సోమవారం కలిసి వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ ప్రతినిధులు ఎ.వి. అప్పారావు, కన్నబాబు, బాబూరావు, నూకినాయుడు పాల్గొన్నారు.

### తుంపాలమ్మ పండగ నేడు



**కశింకోట:** మండలంలోని అచ్చెర్ల గ్రామంలో తుంపాలమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

# విద్యార్థుల రవాణాకు హెచ్‌ఎం ఉదారత

**సొంత ఖర్చుతో ఆటో సౌకర్యం**

**కశింకోట:** విద్యార్థుల పట్ల ప్రధానోపాధ్యాయుడు ఔదార్యం చూపారు. రూ.1500 సొంత ఖర్చుతో ఆటో ఏర్పాటు చేయించి విద్యార్థులు పాఠశాలకు రావడానికి రవాణా సౌకర్యం కల్పించారు. మండలంలోని తాళ్లపాలెం సంత ప్రాంతంలో 3వ నంబర్ ప్రాథమిక పాఠశాలను విద్యార్థుల సంఖ్య పరిమితి కంటే తక్కువగా ఉండటంతో గతంలోనే మూసి వేశారు. ఈ నేపథ్యంలో ప్రాంతానికి చెందిన విద్యార్థులు కిలోమీటరు దూరంలో బంగారయ్యపేట ప్రాథమిక పాఠశాలకు నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నడిచి వెళ్లి చదువుతున్నారు. ఇది ప్రమాదకరం, నడిచి రావడం కష్టంగా ఉండటాన్ని గుర్తించిన ప్రధానోపాధ్యాయుడు గాడి శ్రీనివాసరావు నెలకు రూ.1500 సొంత ఖర్చుతో ఆటోను ఏర్పాటు చేయించారు. 1 నుంచి 5వ తరగతి వరకు చదివే 11 మంది విద్యార్థులకు ఉదయం, సాయంత్రం రవాణా సౌకర్యం కల్పించడంతో వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆటో, హెచ్‌ఎం గాడి శ్రీనివాసరావు

# మేలురకం పశుగ్రాసంతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల పశుసంవర్ధకశాఖ అధికారి నాగశివకుమార్

**మాడుగుల రూరల్:** మేలు రకం పశుగ్రాసం పెంపకంతో అధిక పాల దిగుబడి సాధించవచ్చునని మండల పశుసంవర్ధకశాఖ అధికారి కె.నాగశివకుమార్ పేర్కొన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా వీరనారాయణం గ్రామంలో రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ నెల 14 వ తేదీ వరకు నిర్వహించే ఈ వారోత్సవాల్లో భాగంగా, సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, జొన్న, పిల్లిపెసర వంటి వాటిని ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. ప్రతి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో పచ్చి మేత ప్రాముఖ్యత గురించి, శాస్త్రీయ పద్ధతిలో పశుగ్రాసాలను పెంచే విధానాలు గురించి వివరించారు. కార్యక్రమంలో వీరనారాయణం గ్రామానికి చెందిన పాడి రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అధ్యక్ష పదవికి మూడు ముక్కలాట

**కశింకోట:** మండలంలోని ఉగ్గినపాలెం పాల సంఘం అధ్యక్ష పదవి ఎన్నిక మూడు ముక్కలాటగా మారింది. 25 మంది సభ్యులున్న సంఘానికి ఐదేళ్ల పదవీ కాలానికి ముగ్గురు అధ్యక్షులు పోటీపడ్డారు. వీరు వంతుల వారీగా నిర్వహించడానికి సోమవారం జరిగిన సంఘ ఎన్నికల్లో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎన్నుకున్న ముగ్గురు నామ ధ్యేయాలు రమణ కావడం విశేషం. లాటరీ విధానంలో మొదటి ఏడాది ఊడి రమణ, 2, 3 సంవత్సరాలకు తాడి రమణ, 4, 5 సంవత్సరాలకు పప్పల రమణను అధ్యక్షులుగా నిర్ణయించారు. వీరిలో పప్పల రమణ జనసేన, మిగిలిన వారు టీడీపీ సానుభూతి పరులుగా ఉన్నారు.

### స్థిరంగా కూరగాయల ధరలు

**కశింకోట:** తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర పెరిగింది. కిలో రూ.50కి విక్రయాలు సాగాయి. గత వారం కిలో రూ.30 ఉండగా ఈ వారం ఏకంగా రూ.20 అదనంగా పెరిగింది. ఉల్లి, బంగాళాదుంప రూ.30, బీరకాయ, బెండకాయ, వంకాయ రూ.40, దొండకాయ, బీట్రూట్, క్యారెట్, కాకరకాయ రూ.60, గోరు చిక్కుడు రూ.80, క్యాప్సికం రూ.వంద, పాదు చిక్కుడు రూ.120కి విక్రయాలు సాగాయి.



# కల్తీ మద్యంపై సీఐడీతో దర్యాప్తు చేపట్టాలి

**పరవాడ:** ఇటీవల పరవాడలో వెలుగుచూసిన కల్తీ మద్యం ఘటనపై సీఐడీతో దర్యాప్తు జరిపించాలని పరవాడ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వత్రి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కల్తీ మద్యం తయారీలో నిజమైన దోషులను వదిలిపెట్టి, ఒకరిద్దరిపై కేసులు నమోదు చేసి ఎక్సైజ్ అధికారులు చేతులు దులిపేసుకున్నారని పేర్కొన్నారు. దీని వెనుక స్థానిక పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పార్టీ యూత్ అధ్యక్షుడు గండి మహేష్, బి.చినఅక్కునాయుడు, వెంకటరావు, నరేష్, కె.శ్రీనివాస్, వెంకటరమణ ఉన్నారు.

# సందడిగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



సాయినగర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

**సబ్బవరం:** మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని సమితి నియోజకవర్గ కన్వీనర్ ఇండుగుబిల్లి గోపి, మండల కన్వీనర్ బొర్రా జయరాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దండోరా జెండా ఆవిష్కరించి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జండాను అవిష్కరించి,అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 30 ఏళ్లుగా దండోరా ఉద్యమంలో విశేష సేవలందించిన సీనియర్ నాయకులను మండల కమిటీ తరఫున ఘనంగా సత్కరించారు. మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గొటివాడ సన్యాసి, నీటిపల్లి గంగరాజు, కొమ్ము కోటి అప్పారావు, నీటిపల్లి ముత్యాలరావు, గొటివాడ సామ్రాట్ కుమార్, మారెడుపూడి కోటి, నీటిపల్లి కొండబాబు, నిమిడితల్లి చిన్నారావు, చింతాడ శాంతమ్మ, కొమ్ము జగదీష్, దువ్వి మనోహర్, కొమ్ము తాతారావు, మారెడుపూడి చంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

# కె.నాయుడుపాలెంలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్

**రోలుగుంట:** దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా ఆయిల్‌పామ్ సాగుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాగుకు అనుకూలమని, ఈ పంట సాగుకు రాయితీపై యంత్రాలు, శతశాతం రాయితీపై మొక్కలు పంపిణీ చేస్తున్నట్టు పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ ఏజీఎం పట్టాభిరామిరెడ్డి అన్నారు. కె.నాయుడుపాలెంలో రైతు పైల రవి పంట భూముల వద్ద సోమవారం ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవాన్ని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ పామ్ ప్లాంటేషన్ వారు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సభలో చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ రాయితీపై ఇస్తున్న యంత్రాలు, పంట సాగుకు ఎంతో సాయమందిస్తోందన్నారు. ఏజీఎం పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ కంపెనీ రైతులకు మొక్కలు పంపిణీ నుంచి పండించే పంటను విక్రయించే వరకూ అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. ఎరువుల నిమిత్తం హెక్టారుకు ఏడాదికి రూ.5250 చొప్పున నాలుగేళ్లపాటు అందిస్తుందన్నారు. సీనియర్ మేనేజర్ చంద్రశేఖర్, ఉద్యానశాఖాధికారి శిరీష పాల్గొన్నారు.